క్లుప్తంగా

డీఎస్పీని కలిసిన నాయకులు



డీఎస్పీకి మొక్క అందజేస్తున్న నాయకులు

కాటారం : కాటారం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణను ఆదివారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, పలు సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీకి మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు భూపల్లి రాజు, అఖిల భారత యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం కొమురయ్యయాదవ్, ఆదర్శనగర్ కాలనీ కన్వీనర్ ఆత్మకూరి కుమార్‌యాదవ్, నేతకాని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగొర్ల రాంనారాయణ, వాసు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

మంగపేట : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ట్రెయినీ ఎస్సై శ్రీకాంత్ సూచించారు. మండలంలోని కమలాపురం ఆటో స్టాండ్ వద్ద ఆదివారం హెల్మెట్ వాడకంపై వాహన దారుకలు అవగాహన కల్పించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా హెల్మెట్ లేకపోవడంతోనే అనేకమంది మృతి చెందుతున్నారని ఆయన అన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరు హెల్మెట్ వాడాలని సూచించారు. వాహన చట్టాలను గౌరవిస్తు ప్రయాణం సాగించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఆయన హెచ్చరించారు.

'యువత రాజకీయాల్లోకి రావాలి'

కాళేశ్వరం: యువత స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని, రాజకీయాల్లోకి వచ్చి మార్పు తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ ఆదివారం పేర్కొన్నారు. మహదేవపూర్ మండల అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, పూర్తిగా వెనకబాటుకు గురవుతోందన్నారు. మండలం అభివృద్ధి బాటలో పయణించాలంటే పార్టీలకు అతీతంగా యువత పోటీ చేసి రాజకీయ నాయకులకు గుణపాఠం చెప్పాలని అన్నారు.

రమేశ్‌కు యువకవి మద్దాలి అవార్డు



మొగుళ్లపల్లి : రామదాసు సాహితీ కళ సేవా సంస్థ ఖమ్మం జిల్లా వారు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాహిత్య ప్రక్రియ, ఆపరేషన్ సిందూర్ పుస్తకావిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. అనంతరం నిజాయితీ అనే అంశంపై కవిత పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని ఆకినపల్లి గ్రామానికి చెందిన రమేశ్ ప్రతిభ కనబర్చగా అతడికి యువకవి మద్దాలి అనే అవార్డును అందజేశారు.

లారీలు ఢీ.. డ్రైవర్లకు గాయాలు

గణపురం : మండలంలోని గాంధీనగర్– కర్కపల్లి గ్రామాల మధ్య 353 జాతీయ రహదారిపై ఆదివారం రెండు లారీలు ఢీ కొన్నాయి. చెల్పూరు నుంచి పరకాల వైపు వెళ్తున్న యాష్ ట్యాంకర్, పరకాల వైపు నుంచి చెల్పూరు వైపు వస్తున్న టిప్పర్ లారీ ప్రమాదవశాత్తు ఎదురు ఎదురుగా ఢీ కొట్టుకోగా ఇరువురు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు భూపాలపల్లి సివిల్ ఆస్పత్రికి తరలించా రు. ప్రధాన రహదారిపై లారీలు ఢీ కొనగా కొద్ది సేపు ట్రాఫిక్ స్తంభించింది.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



కాటారం: ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 26, 27, 28న కేరళ రాష్ట్రంలో ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దేశంలో నూతన విద్యా విధానం, నూతన విద్యా సంస్కరణలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ మహాసభల్లో విద్యారంగ సమస్యలు, పరిష్కారాల కోసం పోరాటంపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్, జిల్లా అధ్యక్షుడు స్మరణ్, కార్యదర్శి రాజు, డివిజన్ కార్యదర్శి శ్రావణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగం..'నందనవనం'



ఖాళీ మద్యం సీసాలతో నిండిన నందన వనం పార్కు ఆవరణ



పిచ్చిమొక్కల మధ్య ఆట వస్తువులు

- మందుబాబులకు అడ్డాగా పిల్లల పార్కు
- పట్టించుకోని అటవీ శాఖ అధికారులు



నిరుపయోగంగా పిల్లల జారుడు బల్ల

వెంకటాపురం(కె) : పచ్చటి మొక్కలతో ఆహ్లాదకరంగా ఉండాల్సిన పిల్లల పార్కు నిరుపయోగంగా ఉంది.. అంతేకాదు వినియోగంలోకి రాకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. మండల కేంద్రంలోని రంగరాజాపురం కాలనీ సమీపంలో గల టేకు ప్లాంటేషన్‌లో రెండు హెక్టార్ల విస్తీర్ణంలో అటవీశాఖ అధికారులు రూ.ఐదు లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నందన వనం పిల్లల పార్కు మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు.పిల్లలు, పెద్దలు సేదదీరేందుకు సాయంత్రం పూట ఆహ్లాదకర వాతావారణంను ఆస్వాదించాలని 2018లో అటవీశాఖ అధికారులు నందనవనం పిల్లల పార్కును ఏర్పాటు చేశారు. కాగా అధికారులు పట్టించుకోకపోవడంతో చెత్తాచెదారంతో నిండి నిరుపయోగంగా ఉంది.

పిచ్చిమొక్కల మధ్య ఆటవస్తువులు

నందన వనం పిల్లల పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన జారుడు బల్ల, ఉయ్యాల ఇతర ఆట వస్తువులు పిచ్చి మొక్కల మధ్య దర్శమిస్తున్నాయి. పార్కులో ఉన్న చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించకపోవడంతో ఆట వస్తువులు తుప్పుపట్టి పోతున్నాయి. పార్కులో కూర్చోని సేదదీరేందుకు ఏర్పాటు చేసిన బల్లలు సైతం విరిగిపోయాయి.

దృష్టిసారించని అధికారులు

పిల్లలు ఆడుకోనేందుకు ఏర్పాటు చేసిన పార్కును అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.దీంతో మందుబాబులకు అడ్డాగా మారడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికై నా అటవీశాఖ అధికారులు నందనవనం పిల్లల పార్కుపై దృష్టి సారించి పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పిచ్చిమొక్కలను తొలగించాలి



అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన నందన వనం పిల్లల పార్కు పై అధికారులు దృష్టి సారించి పార్కులో ఉన్న చెత్తచెదారంతో పాటు పిచ్చి మొక్కలను తొలగించాలి. పార్కులో ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా చర్యలు చేపట్టాలి.

\- కట్ల నర్సింహాచారి, స్థానికుడు

వినియోగంలోకి తీసుకురావాలి



రంగరాజాపురం కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన నందన వనం పిల్లల పార్కును అటవీశాఖ అధికారులు పునరుద్ధరించి, వినియోగంలోకి తీసుకురావాలి. పార్కులో పిల్లలు, పెద్దలు సేదదీరేలా ఆహ్లాదకర వాతావరణం కోసం పార్కును అభివృద్ధి చేయాలి.

\- ఎట్టి శ్రీను

విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్ల మార్పు

ములుగు రూరల్ : ములుగు డివిజన్ పరిధి విద్యుత్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న అధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు ఆ శాఖ డీఈ నాగేశ్వర్‌రావు ఆదివారం తెలిపారు. ప్రజలు ఏదైనా విద్యుత్ సమస్యలు తలెత్తినట్లయితే కింది నంబర్లలో సమాచారం అందించాలని పేర్కొన్నారు. ములుగు (డీఈ) 87124 86760, ములుగు (ఏడీఈ) 87124 86805, ములుగు (ఏఈ) 87124 86796, మల్లంపల్లి (ఏఈ) 87124 86792, వెంకటాపురం(ఎం) (ఏఈ) 87124 86821, పస్రా (ఏఈ) 87124 86806, తాడ్వాయి (ఏఈ) 87124 86815, ఏటూరునాగారం (ఏఈ) 87124 86783, 87124 86746, కమలాపూర్ (ఏఈ) 87124 86784, కన్నాయిగూడెం (ఏఈ) 87124 86782, వెంకటాపురం(కె) (ఏఈ) 87124 86833, 87124 86824, వాజేడు (ఏఈ) 87124 86831 నంబర్లలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

'అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు'

మంగపేట : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ పార్టీదని మాజీ జెడ్పీటీసీ, ఆ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య ఆదివారం తెలిపారు. మండలంలో బీజేపీ, బీఆర్ఎస్‌లు రాద్ధాంతం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదల సర్వే నిర్వహించి గుర్తించడం జరిగిందన్నారు. నియోజక వర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో దాదాపుగా 4,000 ఇళ్లను ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. మొదటి విడతలో ఆయా గ్రామాల్లో పూర్తిగా ఇళ్లు లేని, మట్టి ఇళ్లు నిరుపేదలను గుర్తించి వారికి మంజూరు చేయడం జరిగిందన్నారు. మొదటి విడతలో వచ్చిన ఇళ్లను చూసి బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, పదేళ్ల కాలంలో నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని మభ్యపెట్టి ప్రజలను మోసం చేశారని ఆయన ఆరోపించారు. ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మి ఆందోళన చెందొద్దని, అర్హుఅకు ఇళ్లు ఇచ్చి తీరుతామని పేర్కొన్నారు.

ఇసుక రీచ్ అనుమతి రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ సంఘం నాయకులు

వెంకటాపురం(కె) : పీసా చట్టాన్ని ఉల్లంఘించిన సీతారాంపురం ఇసుక రీచ్ అనుమతిని వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు తుర్స కృష్ణబాబు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని సీతారాంపురం గ్రామం ఆలుబాక (జి) పరిధిలో ఉందని అధికారులు పీసా చట్టం నిబంధనలు ఉల్లంఘించి బోదాపురం గ్రామంలో పీసా గ్రామ సభను తప్పుగా నిర్వహించారని ఆరోపించారు. జిల్లా అధికారులకు తప్పుడు నివేదిక పంపించారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన గ్రామ సభ తీర్మానాన్ని రద్దు చేయాలని కోరారు. నాయకులు తాటి రాంబాబు, సందీప్, రఘు, సంజయ్, అశోక్ తదితరులు ఉన్నారు.

'రైతు భరోసా'కు దరఖాస్తు చేసుకోవాలి

కన్నాయిగూడెం : కొత్త పట్టా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు ఈనెల 20వ తేదీలోగా రైతు భరోసా పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ ఒక ప్రకటనలో కోరారు. గతంలో రైతు బంధు పొందిన వారు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, లేదా డిజిటల్ సంతకం అయినా జిరాక్స్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా బుక్, దరఖాస్తు పత్రంతో మండలంలోని విస్తరణ అధికారికి అందించాలని తెలిపారు.

నేడు భూభారతి రెవెన్యూ సదస్సు

ఏటూరునాగారం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నేడు (సోమవారం) భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటూరునాగారం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు, రైతులు తమ భూ సమస్యలు ఉన్నట్లయితే నేరుగా వచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. భూమి పట్టా మార్పులు, చేర్పులు, హద్దులు, ఇతర సమస్యలను ఈ భూ భారతి చట్టం ద్వారా పరిష్కరించడం జరుగుతుందని వివరించారు.

మహిళా కాంగ్రెస్ పట్టణ కమిటీ ఎన్నిక



నియామక పత్రాలు అందజేస్తున్న పావని

ములుగు రూరల్ : ములుగు పట్టణ మహిళా కాంగ్రెస్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు గుంటోజు పావని తెలిపారు. పట్టణ కమిటీ మహిళా అధ్యక్షురాలిగా పిట్టల రాధిక, ప్రధాన కార్యదర్శిగా జక్కుల స్వర్ణ, కోశాధికారిగా గుగులోత్ జ్యోతి, అధికార ప్రతినిధిగా కొయ్యడ లక్ష్మి, కార్యదర్శిగా అల్లూరి సంధ్య, సహాయ కార్యదర్శిగా గుగ్గిళ్ల సుమలతతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు నియమక పత్రాలు అందజేశారు.

మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



వాజేడు : మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో ఆదివారం మైసమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మండల పరిధిలోని జగన్నాథపురం నుంచి చెరుకూరు వరకు రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతుండడవతో గతంలో ప్రతిష్ఠించిన విగ్రహం రహదారి మధ్యలోకి వస్తుంది. దీంతో అక్కడి నుంచి మైసమ్మ విగ్రహాన్ని వేరే చోటకు మార్చి పునఃప్రతిష్ఠ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

ములుగు రూరల్ : మండలంలోని బరిగలానిపల్లికి చెందిన మట్టివాడ నరేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ఎస్‌బీఐ ఉద్యోగులు ఆదివారం చేయూతనందించారు. నరేష్ ఎస్‌బీఐ ములుగు బ్రాంచిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తు మృతి చెందడంతో యూనియన్ నాయకులు బ్యాంక్ అధికారులతో మాట్లాడి రూ.లక్షను ఆర్థికసాయంగా అందజేశారు.అనంతరం నరేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, నాయకులు అహ్మద్, వీరన్న, సత్యం, రాజు, అంకూష్, అకోక్ తదితరులు ఉన్నారు.

చాయ్ కేఫ్ @ గంజాయి దందా



మండల కేంద్రంలో మూసిఉన్న టీస్టాల్

ఏటూరునాగారం : గంజాయి వ్యాపారాన్ని ఏజెన్సీలో గుట్టు చప్పుడు కాకుండా చాయ్‌కేఫ్ మాటునా సాగించారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని తాళ్లగడ్డవద్ద మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన పవన్ టీ, కాఫీ షాపు నడుపుతున్నాడు.అయితే టీ స్టాల్ పేరుతో కొన్ని రోజులుగా గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. చాయ్, కాఫీ పేరుతో మైనర్లకు, యువతకు గంజాయి చాక్లెట్స్, పొడిని విక్రయిస్తూ యువతను మత్తుకు అలవాటు చేశాడు. సదరు వ్యాపారిని వరంగల్‌లో పోలీసులు అరెస్టు చేయడంతో అసలు రంగు బయటపడింది.

మత్తులో యువత

విద్యాసంస్థలు, బస్టాండ్, క్రీడా మైదానాల వద్ద యువత రాత్రి వేళల్లో గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు.ఈక్రమంలో గంజాయి సేవిస్తుండగా ఏటూరునాగారం పోలీసులు శనివారం ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి వివరాలను కూపీలాగుతూ మత్తు పదార్థాల రవాణా, వినియోగిస్తున్న యువత పేర్లను సేకరిస్తున్నట్లు తెలిసింది.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి పోలీసులు ఇప్పటికే హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల నడవడికపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లే స్నేహితులతో కలిసి తిరుగుతున్న ప్రాంతాలు, వారి అలవాట్లను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కఠిన చర్యలు తప్పవు



ఎంతటి వారైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు. యువత తెలిసి తెలియని వయస్సులో నిండు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న యువకులు సన్మార్గంలో నడుచుకోవాలి. మత్తు పదార్థాల విషయం బయటకు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

\- అనుముల శ్రీనివాస్, సీఐ

సహజ వనరులు దోచే కుట్ర

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

భూపాలపల్లి అర్బన్ : కార్పొరేట్ శక్తులకు దేశంలోని సహజ వనరులను కట్టబెట్టేందుకు, అడవులను వారికి అప్పగించేందుకు మావోయిస్టులను లేకుండా చేయాలని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీ సింగరేణి కమ్యూనిటీహాల్‌లో ఆదివారం సీపీఐ భూపాలపల్లి పట్టణ మహాసభ నిర్వహించారు. మహాసభ ప్రాంగణంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. పార్టీ పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో కమ్యూనిస్టులను లేకుండా చేసేందుకే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిందన్నారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్రం ఎంతోమందిని పాశవికంగా హత్య చేస్తోందన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించిందని ప్రజలు మళ్లీ కాంగ్రెస్ అధికారం ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భూపాలపల్లి మున్సిపాలిటీపై ఎర్రజెండాను ఎగురవేద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు.సీపీఐ కౌన్సిల్ సభ్యులు గురుజపెల్లి సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, మాతంగి రామ్‌చందర్, కొరిమి సుగుణ, మాజీ కౌన్సిలర్ నూకల భూలక్ష్మి చంద్రమౌళి, నాయకులు ఆసిఫ్ పాషా, తాళ్ల పోషం, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్‌లు, 250 మంది అతిథులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గోవిందరావుపేట: సమ్మేళనంలో పాల్గొన్న 1996-97బ్యాచ్ విద్యార్థులు



ఏటూరునాగారం: చిన్నబోయినపల్లిలో 2000-21 బ్యాచ్ విద్యార్థులు

గోవిందరావుపేట : మండలంలోని చల్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996-97 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బాల్యంలో తాము చదువుకున్న పాఠశాలలో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి స్నేహితులు తమ తీపి గుర్తులను పంచుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థిని ఏటుకూరి అనితను విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సలేంద్ర రాజుకుమార్, తాటిపల్లి రాజు, గుంట శంకర్, లావుడియా లచ్చిరాం, చెప్పల రాజేష్, బొడిగె రఘువీర్, బల్లెం ముత్తయ్య, సామ శ్రీను, మండడి సారంగపాణి, ఐతే రాజు, విజయ్ కుమార్, మల్లేష్, కేదారి, నరాల శ్రీనివాస్ రెడ్డి, సురేంద్రచారితో పాటు తదితరులు పాల్గొన్నారు.

చిన్నబోయినపల్లిలో..

ఏటూరునాగారం : మండలంలోని చిన్నబోయినపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 2000–21 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. బాల్యస్నేహితులను కలుసుకొని వారి కష్టసుఖాలను పంచుకున్నారు. చదువుకునే రోజుల్లో పాఠశాల ఆవరణలో ఆనందంగా గడిపామని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకరినొకరు అభినందించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకయ్య, నాగేశ్వరరావు, కల్తి శ్రీనివాస్, ధరావత్ రాజు, సదానందం, అంజనమూర్తి, యాదయ్య, శ్రీరాములు, విద్యార్థులుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

18న క్రీడా పాఠశాలలకు ఎంపిక పోటీలు

మల్హర్ : రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో (కరీంనగర్, ఆదిలాబాద్, హకీంపేట) 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగో తరగతిలో చేరేందుకు మండలంలో విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి లక్ష్మణ్‌బాబు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణచందర్‌రావు తెలిపారు. ఆదివారం మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 18న ఉదయం తొమ్మిది గంటలకు మోడల్ స్కూల్ ఎడ్లపల్లి క్రీడా మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గుర్తింపు పొందిన పాఠశాలల్లో నాలుగో తరగతి చదవడంతో పాటు 2016, ఆగస్టు 31 నుంచి 2017, సెప్టెంబర్ 1 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులను చెప్పారు. ఇక్కడ ఎంపిక చేసిన విద్యార్థులకు ఈనెల 23న జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆధార్ కార్డు, నాలుగో తరగతి బోనఫెడ్ సర్టిఫికెట్ డేటఆఫ్ బర్త్, కుల ధ్రువీకరణ పత్రం, మూడో తరగతి ప్రోగ్రెస్ కార్డు, పాస్ ఫోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 90009 48940, 86393 46695 నంబర్లను సంప్రదించాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్



చెక్కు అందజేస్తున్న రవియాదవ్

ములుగు రూరల్ : అనారోగ్యంతో కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం పొందిన పేదలకు సీఎంఆర్ఎఫ్ వరమని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవియాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితురాలు తాల్ల అనూషకు రూ.లక్ష చెక్కు మంజూరు కాగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఓంప్రకాష్, బీసీ సెల్ అధికార ప్రతినిధి ఇమ్మడి రమేష్, రియాజ్‌మిర్జా, ఒజ్జల కుమార్, గుంటోజు పావని, ఆసియా, నిరంజన్, బొంతల రాజు తదితరులు పాల్గొన్నారు.